# జీవన కలశం

ఓ చిన్న గుడిసె ముందుకు వచ్చేసరికి చాలా ఆనందం కలిగింది.నేను చేరుకోవలసిన స్త్రీ ఆ పాకలోనే ఉంది. ఆమె నంగీకరింప జేయగలిగితే నాధ్యేయం నెరవేరినట్టే. లక్ష్యం సాధించినట్లే.

చుట్టుప్రక్కల ఎవరూ లేదు. సమయం ఎవరూ ఉండని అసమయం. దగ్గరగా వేసి ఉన్న తడక తలుపుని ఉత్సాహంగా సమీపించి ఎంతో ఆత్రంగా తోశాను. చీకటి వెలుగుల మధ్య దోబూచులాడుతున్న ఆ గదిలో మంచం మీద పడుకుని అస్పష్టంగా.. ఓ స్త్రీ. నాకు కావలసినదామే. సంతోషం పట్టలేక పోతున్నాను, నేను.

"నీ పేరే కదూ జమున?"

అమె అటునుంచి ఇటు నా వేపు తిరిగింది. "నమస్కారం. మీరు డాక్టరు బాబు... ఏం?" అంటూ అమె తన మీద దుప్పటి తొలగించింది.

త్రుళ్ళిపడ్డాను. అమె నాకు కావలసిన జమునే. కాని... నేను ఫూల్ చేయబడలేదు కద? మరీ కక్కుర్తి పడడానికి దిగజారితే తప్ప ఈమె నాకు పనికొచ్చే కేసు ఎంత మాత్రమూ కాదు.

"జమునని నేనే బాబూ... చూస్తున్నారుగా... చిన్నప్పుడు అదేదో పోలియోనో మాయదారి రోగమో వచ్చి కాలూ, చెయ్యి చచ్చుపడిపోయాయి. నా అంతట నేను మంచం మీంచి లేవలేను. లేచి మీకు మరియాద చెయ్యలేను. మరోలా అనుకోక ఆ బల్లమీద కూర్చోండి. సమయానికి సొంబ ఉన్నా తీరిపోను. డాక్టరు గారొచ్చినా మరియాద చేయదానికి మనిషి లేకపోయాడు" నిట్టూర్చింది.

నా చేతిలో బ్రీఫ్ కేసు చూసి అమె నన్ను డాక్టరు అనుకుంటూందేమో. అవును ఈమెకు డాక్టరుతో కాక నాతో ఏం పనుంటుంది?

"సొంబ ఎవరు?" యధాలాపంగా అడిగాను. వచ్చినవాడిని - గోడకు కొట్టిన బంతిలా తక్షణం తిరిగిపోతే బాగుండదని.

"మా ఆయన" ఆమె ముఖంలో సిగ్గు! నివ్వెర పోయాను. నిగ్రహించుకోలేకపోయాను. చటుక్కున బయటిపడిపోయాను. "నీకు పెళ్ళి అయిందా!"

కాలూ చేయి మినహా బాగానే ఉంది. మనిషి లాగే ఉంది కొంత.కాని ఆ లోపం చాలదూ అమె సమస్త జీవితాన్నీ దుర్భరాతి దుర్భరమూ, నిరర్ధకమూ చేసి వదలడానికి శాశ్వతంగా? శరీరానికి స్వయం చలనశక్తి కొరవడితే జీవితంలో ఉత్సాహమూ ఉల్లాసమూ పూర్తిగా నిండుకుని మనిషికి తన బతుకు తనే గుదిబండ ఐపోదూ ! ఇటువంటి హీనపుణ్యుల నెందుకు పుట్టిస్తాడు దేవుడు? పుట్టించినా ఇటువంటి నికృష్టులని ఎందుకు చిన్నప్పుడే చంపెయ్యడు? తమకీ, తమవారికీ శాశ్వత భారంగా వీళ్ళెందుకు బతుకుతారు? ఎలా బతుకుతారు?

"పెళ్ళి కాకుండా ఆయనెలా వొస్తాడు డాక్టరుగారూ? వొచ్చినా ఎలా చెప్పుకోగలదు నాలాటి

మంచానికి బతుకుని కట్టేసింది. అందరిలాగ నడవా, పరిగెత్తా లేని నేను చచ్చిపోదామనే అనుకునేదాన్ని. అమ్మలేని నన్ను చచ్చిపోడానికి అక్క వొప్పుకుంది కాదు. నేను బడి కెళ్లలేకపోగా - చదువునే నా మంచం దగ్గరికి తెచ్చింది. మంచం మీదే కథలూ కబుర్లూ విన్నాను. మంచితిండీ మందులూ తిన్నాను. కొంత మనిషినీ అయ్యాను. అంతటితో ఆగిందా దేవతలాంటి అక్క? ఊహూ.

జమునా? నువ్వాడదానివే. ఆడపుట్టుక కర్థముందే. ఆడబతుక్కందముందే, చందముందే - అంటూ నాకు వయసు రావడమేమిటి ఏ పుర్రాకులు పడిందో నాకో మగాణ్ని తెచ్చి పెళ్ళి చేసింది. మా పెళ్ళయి నాలుగేళ్లయింది..." ఆమె కంఠం గద్గదికమయింది.

విభ్రాంతుడినై వింటున్నాను నేను.

"సాంబకి కళ్లు లేకపోతే ఏం. నాతో కాపరం చేసే దృష్టివుంది. నాకు కాలూ చెయ్యీ...రెండూ లేవు. అతనికి కళ్లు రెండు లేవు. సరికి సరి. దొందుకు దొందు. ఐనా నేనాడదాన్ని అతను మగాడు. నాకు ఆడవొళ్ళుంది. అతనికి మగవొళ్ళుంది. మేమిద్దరమూ మూడేళ్ల పైగానే ముప్పొద్దులా ముచ్చటగా కాపరం చేస్తూ వొస్తున్నాము..."

అవకాశం దొరికినట్లయింది నాకు. ఇటువంటి వాళ్లు బతుకుండకూడదు. బతికినా పెళ్లి చేసుకోకూడదు. పెళ్లి చేసుకున్నా ఎంత మాత్రమూ పిల్లల్ని కనకూడదు గాక కనకూడదు. పుట్టేపిల్లలు అష్టవంకరలతో పుట్టొచ్చు. పిల్లల్ని పోషించే ఆర్థిక స్తోమతా, శారీరక స్తోమతా కూడా లేదీ స్త్రీకి. ఇటువంటి స్త్రీకే కుటుంబ నియంత్రణ మరీ అవసరం. అదే చెప్పాలామెకి. నచ్చచెప్పాలి. రేపే లాప్రొస్కపీ చేయించాలి. ఈమె కనకూడదు గాక కనకూడదు. ఈమెవంటి వారు పిల్లల్ని కనడం తెల్సి చేసే మహాపాపమే. నేరమే. దారుణమే.

"ఇంతవరకూ ఎంత చక్కగా సంసారం చేస్తున్నా నా కడుపు పండలేదు. ఆడబతుకు అధ్వాన్నమై పోతుందేమో, తల్లికాకుండానే తెల్లవారిపోతానేమో అని దిగులు పట్టుకుంది. పురిటి ముచ్చట తీరదేమో అని అనుమానం వొచ్చేస్తోంది. అమ్మా అనిపించుకోవాలని ఆత్రుతపడి పోతున్నాను. ఆడదాయిని కదా, ఒక్కసారయినా తల్లినైతే తప్ప తనివితీరదు మరి..."

తెల్లబోతూ అడిగాను. "నీకు బిడ్డకూడా పుడితే ఎవరు పోషిస్తారు?"

"మా అక్కే . . అదీ కాక ఎవరు చూడొచ్చారు, బిడ్డపుట్టిన వేళా విశేషం? మా అక్క దేవత. నాకూ బిడ్డకూ ఏ లోటూ రానివ్వదు. నేనింకా కనలేదని నాకంటే మా అక్కే ఎక్కువ బెంగెట్టేసుకుని ఇవాళ మిమ్మల్ని పంపించింది, నన్ను పరీక్షించమని. డాక్టరు బాబూ ! సిగ్గు విడిచి మనసు బయట పెట్టేస్తున్నాను. నన్ను పరీక్షించండి. మంచి మందులివ్వండి. తొమ్మిది నెలలు తిరిగేసరికి నేను తల్లిని కావాలి..."

ప్రార్థనే అది. అది ప్రాధేయతే. ఎంత కోరిక మాతృత్వం పట్ల ! ఎంత ఆత్రుత అమ్మ కావాలని ! ఇంత పరాధీనపు బ్రతుకులోనూ పాప కోసం ఎంత పరితాపం?

ఇదే భారతీయ స్త్రీత్వం ! ఈమే భారత స్త్రీ ! నా అజ్ఞానాన్నీ, అమాయకత్వాన్నీ - చూసి జీవితం నవ్వుతున్నట్లే అనిపించింది. ఇంక ఆమె ముందు నిలబడడానికి తప్పుచేసినట్లే అనిపిస్తోంటే చరచర బయటకు వొచ్చేశాను చెప్పకుండా.

ఔను. నేను ఆమెకి జన్మలో పిల్లలు కలగకుండా ఆపరేషను కంగీకరింపజేయడానికి వొచ్చిన కుటుంబ నియంత్రణపు మనిషని తప్ప, ఆమెను అమ్మను చేయడానికి వొచ్చిన డాక్టరుని కానని ఆమె మాటలూ కథా విన్నాక...వ్యధ తెలుసుకున్నాక ఎలా చెప్పగలను?

పైనుంచి చూసేవారికామె బతుకు ఓటికుండలా కనిపించవచ్చు. కానీ ఆమె బ్రతుకు ఆమెకు పూర్తిగా ఆశతోనూ కోరికలతోనూ నిండిన నీటికుండ అని నేను గ్రహించగలిగాను.

(1978లో ఆంధ్రభూమి ఆదివారం అనుబంధం కథలపోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ)

✡ ✡ ✡ ✡ ✡

# చెల్లని నోటు

డబ్బేం చేస్తుందో అదే డబ్బంటే - అని డబ్బు నిర్వచనం. బాగానే ఉంది. కాని డబ్బు మనుషుల చేత ఏమేం చేయిస్తుందో వాటినేమనాలి? ప్రభాకరరావ్ ఓ పెద్ద కార్యాలయంలో చిన్న క్లర్కు. ఇప్పటి చాలామంది మనుషులలోలాగే అతనిలోనూ కొన్ని బలహీనతలు. ఐతే - వాటినతడు తెలివితేటలనుకుంటాడు. గొప్పగా కూడా భావిస్తాడు.

"మీరేం చేస్తూంటారు?" అని అతన్నెవరయినా అడిగితే "ఫలానా సంస్థలో" అని గొప్పదయిన సంస్థ పేరు చెబుతాడు. ఉద్యోగమంటాడు తప్ప గుమాస్తా అని బయటపెట్టడు, అత్యవసరమూ అనివార్యము అయితే తప్ప, మధ్యతరగతి మనిషి కనక మిధ్యా గౌరవం కోసం పాకులాడి. అందుకు ఆత్మవంచనకీ, పరవంచనకీ కూడా సంసిద్ధమే. యువకుడు కనుక పై తరగతి జీవితం మీద మోజు, ఆశలూ అంటే - విలాసాలూ, వినోదాల మీద వాంఛలు.

అతను గుమాస్తా కనుక అతని కందేది జీతం. జీతమంటే జీవితానికి చాలనిది. జీవితపు చొక్కాకి జీతం గుడ్డ ఎప్పుడూ తక్కువే ఔతూంటుంది. జీతం స్వభావమది. ఐతే ప్రభాకరరావ్‌కి వెనక అమ్మ ఉంది. కాస్త ఆస్తి ఉంది. అతను భార్యకిచ్చేది వెయ్యి రూపాయలే అయినా నెలాఖరున కూడా వినీల దగ్గర వందో యాభైయ్యో మిగిలే ఉంటాయేమో డబ్బుల పెట్టెలో. అయినా ప్రభాకరరావుకి సంతృప్తి ఉండదు. అవసరాలు తీరడమే కాదుకదా జీవితం ! అసలు - డబ్బంటేనే ఎంతున్నా చాలనిదని మరో నిర్వచనం.

ప్రతీ జీతాల రోజులాగే ఆవేళా జీతమందుకుని - నలుగురు మిత్రులతో ఎదురుగా ఉన్న హోటల్‌లోకి నడిచి ఖరీదయిన స్వీట్సూ ఐస్‌క్రీములతో సహా కడుపు పట్టినంత తిని - కిళ్ళీ బిగించి...సిగరెట్ అంటించి స్వర్గసుఖం అనుభవిస్తున్నట్లు తనని తాను భ్రమ పెట్టుకుని - క్లబ్‌లోకి నడిచాడు.

పేకాట... జీతాల రోజు నెలకొకసారే కదా ! ఆ వేళయినా అనుభవించకపోతే ఎలా?